# మార్పు

## ఇంగువ అన్నపూర్ణ

వేసవి కాలం సెలవలు గడపటానికి నేను వస్తే, తను కూడా నాగపూరు వస్తానని రాస్తాడు కృష్ణ. అలాగే నేను వచ్చే ముందు రోజే తనూ వచ్చాడు నాగపూరుకి. వాడు అడపాదడపా ఇంగ్లీషులో చిన్న కథలు రాసి పేపరుకి పంపిస్తుండేవాడు. కాలేజి రోజుల్లో ఇప్పుడు రాయడం లేదల్లే వుంది. నేను వచ్చిన రోజు సాయంత్రం ఇద్దరం డాబా మీద కూర్చున్నాం. కథ గురించి చర్చించుకోటానికి.

"దేని గురించి రాయాలనుకుంటున్నావు?" అడిగాడు కృష్ణ.

"ఇది ఒకచోట నిజంగా జరిగింది. ఇది విన్నప్పుడు నా మనసెంతో వికలమయింది. జరిగింది జరిగినట్టుగా రాయాలనుకుంటున్నాను."

"చెప్పు"


"అదొక పల్లెటూరు. ఏ వూరని అడక్కు. ఆ వూరిలో ఒక డాక్టరు వున్నాడు. అతని పేరు రాజారావు. వయసు యాభై సంవత్సరాలుంటుంది. ఇంట్లో అతను, భార్య, కొడుకు, కోడలు వుంటారు. కొడుకేదో ఉద్యోగం చేస్తున్నాడు కానీ, అది మనకు అనవసరం.

రాజారావు ఇల్లు, డిస్పెన్సరీ ఒకచోటే వున్నాయి. క్రింద డిస్పెన్సరీ, పైన కాపురం. ఆ వూరికి ఆయనొక్కడే డాక్టరవడం వల్ల, చుట్టుపక్కల వారేమిటి, అందరూ ఆయన దగ్గరకే వస్తారు. ఆయన ఇచ్చే మందు అక్కడి ప్రజలకు ఎంతవరకు పనిచేసేదో తెలియదు కానీ, ట్రీట్‌మెంటు కోసం వచ్చే క్రింది తరగతి ఆడవారిని మాత్రం వుత్తచేతులతో పోనిచ్చేవాడు కాదు. పై తరగతి ఆడవారు అతని సంగతి తెలిసి అతడి వద్దకు వంటరిగా వచ్చేవారు కాదు. క్రింది తరగతి మగవారికి అతని సంగతి తెలిసినా, మరే డాక్టరు అందు బాటులో లేకపోవడంతో ఏమీ చేయలేక నిస్సహాయంగా వుండిపోయేవారు. అభిమానం గల స్త్రీలు ఎదురు తిరిగితే, వారిని భయపెట్టో, బెదిరించో ఫీజు వసూలు చేసుకునేవాడు.

అతడి గురించి పోలీసులకు రిపోర్టు ఇద్దామన్నా, ఇలాంటి వారికి పోలీసుల అండ దండలు బాగా వుంటాయని ఆ పల్లె ప్రజల కందరకు తెలుసు.

ఆ రోజు రాజారావు జీవితంలో అనుకోని మార్పు సంభవించిన రోజు. ఆనాడు ఒక నడివయసు స్త్రీ దాదాపు ముప్పయి సంవత్సరాలుంటాయేమో అతని వద్దకొచ్చింది ట్రీట్‌మెంట్ కోసం. ఆమెను ఇదివరకు రాజారావు చూసి వుండలేదు.






ఆమె దుస్తులను బట్టి క్రింది తరగతి యువతిగా గుర్తించాడు. సుస్తీ ఏమిటని వివరాలు అడిగాడు. కడుపులో నొప్పి వస్తున్నదని, మందు కావాలని అడిగింది ఆమె. పరీక్షచేసి చెప్తానని ఆమెను లోపలికి పంపేసి బయట కూర్చున్న పేషెంట్లకు మందులిచ్చేసి త్వరగా పంపేసి లోపలికి వెళ్ళాడు రాజా రావు.

నొప్పి ఎక్కడ వుంది అంటూ చేతులతో ఆ యువతి కడుపుపైన నొక్కుతూ, అలా అలా ఆ చేతులతో ఇష్ట మొచ్చిన చోటల్లా తడమసాగాడు: ఆ యువతి గ్రహించింది అతని వుద్దేశం. వెంటనే లేవబోయింది. ఆమెను లేవనియ్యలేదతను. ఆమె అరవబోతే నోరు నొక్కేశాడు. ఆ తర్వాత ఆమె కేకలు బయటకు వినిపించ కుండా తలుపేసేశాడు. ఆ తరువాత ఆమెకు ఐడేటివ్ ఇంజెక్షన్ ఇచ్చాడు. ఇంత కాలంగా ఇలా జరుగుతున్నా రాజారావు భార్యకు ఈ విషయాలు తెలియవా అంటే అన్నీ తెలుసు. భర్తను మార్చాలని ఆవిడ తన శాయ శక్తులా ప్రయత్నించింది కానీ, అతను అంత తేలికగా మారే రకం కాదని ఆమె గ్రహించడానికి ఆట్టే కాలం పట్టలేదు. భర్త కారణంగా నలుగురిలో తన పరువు పోతున్నా, నా ఖర్మ అనుకుని బ్రతుకుతున్నది ఆవిడ. కొడుక్కు పెళ్ళి చేశాకయినా భర్తలో పెద్దరికం వస్తుం దేమోనని ఆశపడిన ఆమెకు ఆశాభంగమే అయింది.

తన పని పూర్తవగానే ఆ యువతి స్పృహలో కొచ్చే లందుకు ఇంజక్షనిచ్చి బయటకు వెళ్ళిపోయాడు రాజారావు. తెలివిలోకి వచ్చిన ఆ యువతి గుండెలు పగిలేలా ఏడుస్తూ వెళ్ళిపోయింది.

ఆమె ఎవరో, ఏ జాతికి చెందిందో రాజారావుకు తెలియదు. అతనికి తెలియనిది మరొకటి వుంది. అది ఆ యువతి తాలూకు మనుషులు సామాన్యులు కారనీ, వారితో తలపడడం కొరివితో తల గోక్కోవడమేనని. విషయం తెలిసిన ఆమె గూడెంవాళ్ళు ఉడుకెత్తి పోయారు. ఆ జాతి మనుషులు స్వతహాగా ఎవరికీ హాని చెయ్యరు. తమకు కీడు తలపెడితే వారిని సర్వనాశనం చేసికాని వదలరు.

ఇది జరిగిన నాలుగో రోజున రాజారావు కోడలు, నిండు గర్భిణి, హఠాత్తుగా మాయమయింది. ఆమె భర్తతో కలిసి రాత్రిపూట వస్తుండగా కొందరు మను షులు దారి కాచి పట్టుకుని, అతను చూస్తుండగానే కత్తులతో బెదరించి ఆమెను ఎత్తుకుపోయారు. భర్త ప్రాణాలకు అపాయం సంభవిస్తే, భార్య తన ప్రాణాలను సైతం లెక్కచేయక అతనిని కాపాడడానికి ప్రయత్ని స్తుంది. కాని సూర్యం తన ప్రాణం దక్కితే చాలునను కుని ప్రాణాలు గుప్పిటలో పెట్టుకుని ఇంటికి పారిపోయి వచ్చాడు. కోడలిని గురించి అడిగిన తల్లిదండ్రులకు జరిగింది వివరించాడు. రాజారావు భార్య చాలా బాధ పడింది.

"వెంటనే పోలీసులకు ఫోనుచేసి చెప్పండి కోడల్నె త్తుకెళ్ళారని" అంది ఆవిడ. రాజారావు కాని, సూర్యం కాని సమాధానం చెప్పలేదు. పోలీసులు ఎక్కడని వెతుకు తారు? వాళ్ళు వెతికే వరకు ఆమె శీలం చెడకుండా వుంటుందా? ఆ తర్వాత రక్షించినా ఒకటే, రక్షించకున్నా ఒకటే. అదే వాళ్ళిద్దరి మనసుల్లో వున్న ఆలోచన.

"ఇంటికి పారిపోయి రాకపోతే, అప్పుడే పోలీసులకు రిపోర్టు ఇవ్వలేకపోయావా?" అనడిగింది తల్లి సూర్యాన్ని.

"నేను పోలీసు స్టేషన్‌కి వెళ్తున్నానని తెలిస్తే చంపే స్తారని భయమేసింది." "పెళ్ళాం శీలం కంటే మొగు డికి తన ప్రాణమే ముఖ్యమయిపోయిందంటే, ఈ దేశపు సగటు ఆడదాని బ్రతుకు ఎంత తేలికై పోయిందో" అని ఆవిడ ఎంతగానో వాపోయింది.

ఆవిడ మనసులో ఒకటే అనుమానం తొలిచేస్తూ వుంది. తన భర్త కామానికి బలైపోయిన ఏ స్త్రీ తాలూకు మనుషులైనా కోడల్ని ఎత్తుకెళ్ళి వుంటారని ప్రతీ కారం తీర్చుకోవడానికి. ఆ రాత్రి ఆ ఇంట్లో ఎవరికీ నిద్రాహారాలు లేవు. ఆవిడ అనుమానం నిజమని ఆ మర్నాడు ఉదయమే తెలుసుకున్నారు. ఉదయం లేచే సరికి దినపత్రిక మడతల్లోంచి కనపడే విధంగా ఒక కాగితం వుంచబడడం గమనించారు. రాజారావు అదేమి టోనని తీసి చదివాడు ఆదుర్దాగా. చదివాక అతని మొహం తెల్లగా పాలిపోయింది. ఆ ఉత్తరంలో ఇలా వుంది:

"మిస్టర్ రాజారావు,

ఇంత కాలంగా నువ్వు కామంలో కళ్ళు మూసుకు పోయి ప్రవర్తిస్తున్నా అందరూ సహిస్తూ వచ్చారు. ఇన్నా ళ్ళకు నీ పాపం పండేరోజు వచ్చింది. నీ చెప్పుతోటే నీ మొహం మీద కొట్టాము, అని ఉత్తరం ద్వారా గ్రహిస్తా వనుకుంటాము. ఇన్నాళ్ళు పరాయి స్త్రీలను నీసొత్తులాగా అనుభవిస్తే ఈ రోజు నీ కోడల్ని మేమందరం పంచు కున్నాము. నీ కోడలిని ఈ సాయంకాలం అందరూ చూస్తూ వుండగా నీ ఇంటి వద్ద మా మనిషి దిగ బెడతాడు. ఎదురు చూస్తూ వుండు."

క్రింద సంతకం లేదు. ఉత్తరంలోని విషయం తెలుసుకుని రాజారావు భార్య మొదటిసారిగా అతని మీద విరుచుకుపడింది.

"ఇదంతా నీ కారణంగానే అయింది. ఏదో ఒక రోజు విపత్తు ముంచుకువస్తుందని నాకు ముందరే తెలుసు. ఇలాంటి వాడితో కాపురం చేయాలని దేవుడు నా మొహాన ఎందుకు రాశాడో? ఎవరి జీవితాల్లో నిప్పులు పోశావో ఈ జన్మలో ఇలాంటి మొగాడు దొరికాడు" అంటూ ఆ రోజంతా శాపనార్థాలు పెడుతూనే వుంది ఆవిడ.

ఆ సాయంకాలం రాజారావు డిస్పెన్సరీలో రోగులను చూస్తున్నాడు. అప్పటికే రాజారావు కోడల్ని ఎవరో ఎత్తుకెళ్ళారనే విషయం అందరికీ తెలిసిపోయింది. పేషెంట్లు గుసగుసలు చెప్పుకోవడం ప్రారంభించారు. రాజారావు పేషెంట్లను చూస్తున్న ఆ సమయంలో ఒక టాక్సీ వచ్చి డిస్పెన్సరీ ముందాగడం, అందులోంచి ఒక వ్యక్తి స్పృహలో లేని రాజారావు కోడలు నిండు గర్భిణీని వాకిలి ముందు పడుకోబెట్టి వెళ్ళి టాక్సీలో కూర్చో వడం, వెంటనే టాక్సీ వేగంగా వెళ్ళిపోవడం, అంతా క్షణాలలో అందరూ చూస్తూ వుండగా జరిగిపోయింది. రాజారావు భార్య, సూర్యం పైనించి దిగివచ్చారు.

"సాయంపట్టి లోపలికి తీసుకెళదాము" అందావిడ సిగ్గుతో చితికిపోతూ. డిస్పెన్సరీలోని పేషెంట్లు అందరూ గుసగుసలాడుకుంటున్నారు తమగురించి. అందరికీ విషయం ఏమిటో తెలిసిపోయింది.

"వద్దు" అన్నాడు సూర్యం. విస్మయంగా చూసిం దావిడ కొడుకువైపు. కోడలి బట్టలన్నీ చిరిగిపోయి, తల రేగిపోయి, మొహం మీదా, శరీరం మీదా గాట్లతో అసహ్యంగా వుంది. ఆమెకు రక్తస్రావం జరుగుతున్నది. త్వరగా ట్రీట్‌మెంట్ ఇప్పించకపోతే ప్రమాదం. ఆమె రాజారావును కేకేసింది.

"కోడలిని లోపలికి పట్టండి త్వరగా. ఆమెకు బ్లీడిం గవుతోంది. త్వరగా పట్టుకోండి" తొందర చేసింది.

"ఏమిటే నువ్వనేది? ఈ చెడిపోయినదాన్ని ఇంకా ఇంట్లోకి ఎందుకు, ఎక్కడికి వెళ్ళిందో అక్కడికే పొమ్మను" అన్నాడు సూర్యం. వెంటనే సూర్యం చెంప ఛెళ్ళుమన్నది.

"నోర్ముయ్ చవటా! భార్యను ఎత్తుకుపోతుంటే

కాపాడ్డం చేతకాని వెధవ్వి నువ్వూ ఓ మగాడివేనా? పైగా అది వెళ్ళిందంటావా...ఊఁ...పట్టండి మాస్టారేమిటి అలా గుడ్లప్పగించి, అమ్మాయికి బ్లీడింగైపోతున్నది. త్వరగా లేడీ డాక్టర్ని పిలిపించండి ఫోనుచేసి.''

రాజారావులో చలనం లేదు. పదిమంది చేత మాన భంగం చేయబడిన అమ్మాయి తన కోడలు కాదు. తనాదరించలేదు ఆ అమ్మాయిని. భార్య ఎదుట అలా అనాలంటే ధైర్యం చాలడం లేదు. అయినా తెగించి అనేశాడు.

''పది మంది చేత పరాభవింపబడిన పిల్ల నా కోడలు కాదు. ఆ అమ్మాయి ఇంట్లోకి రావడానికి వీలు లేదు'' ఖరాఖండిగా చెప్పేశాడు.

ఆ మాటలతో ఆవిడ కోపం తారాపథానంటింది. ''ఛీ దుర్మార్గుడా! ఇంత జరగడానికి కారణం ఎవరు? నువ్వే నీతిగా వుంటే, ఈనాడు ఈ గతి నా కోడలికి పట్టేది కాదు...మామగారుగా కాదు; ఒక డాక్టరుగా ఆమెకు ట్రీట్‌మెంటివ్వు. తర్వాత ఆలోచిద్దాము ఏం చేయాలో.'' అక్కడే వున్న కొంతమంది పేషెంట్ల తాలూకు మనుషులు ఆమెకు సాయంచేశారు ఆ అమ్మాయిని లోపలికి తీసుకుపోవడానికి.

మనుషులను పంపి ప్రక్క ఊరి నుంచి లేడీ డాక్టర్‌ను పిలిపించారు. ఆమె గర్భస్రావం జరగకుండా కాపాడాలని శతవిధాల ప్రయత్నించి విఫలమయింది. కోడలు మాత్రం కోలుకుంది మరో పదిహేను రోజులకు. తల్లికి వెరచి సూర్యం, భార్యకు జడిసి రాజారావు ఆమె నేమీ అనరు కానీ సూర్యం మటుకు భార్యను బాగానే చూసుకుంటున్నట్లు పైకి కనబరుస్తాడు. అదంతా నటనే అని తల్లి గ్రహించినా ఏమీ చేయలేక వూరుకో వలసివచ్చింది.

ఇప్పుడు సూర్యం భార్యతో దాంపత్య బంధాన్ని తెంచేసుకుని, బయట ఆ బంధాలను పెంచుకుని తండ్రి వదిలేసిన దారిలో ఇప్పుడు తాను నడుస్తున్నాడు.''

''ఇదీ జరిగిన కథ,'' అన్నాను కథ చెప్తూ. కూర్చో వడంలో పరిసరాల్ని గమనించనే లేదు నేను. బాగా చీకటిపడిపోయింది.



ఇటీవల విజయవాడలో జరిగిన 'ఆహా ! నా పెళ్ళంట!!' చిత్రం యూనిట్ అభినందన సభలో నిర్మాత శ్రీ రామానాయుడు, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక సంపాదకులు శ్రీ పురాణం సుబ్రహ్మణ్యశర్మ, దర్శకుడు శ్రీ జంధ్యాల, నటుడు రాజేంద్రప్రసాద్, నటి రజని

''అంతేనా కథ?'' అడిగాడు కృష్ణ. అవునన్నట్లు తలూపాను.

''కథ బాగానే వుంది కానీ, ఇలా జరిగింది జరిగినట్లు రాసేస్తావా?''

''అవును. అలానే రాయాలనుకుంటున్నాను.''

''కానీ జరిగింది జరిగినట్లు రాస్తే అది వార్త అవు తుంది. మార్చి రాస్తే అది కథ అవుతుంది'' అన్నాడు కృష్ణ.

''ఇందులో మార్చేందుకేముంది?''

నువ్వు చెప్పినట్లు అత్తగారు ఆదరించి కడుపులో దాచుకోవడమనేది సాధారణంగా జరగదు. అత్తగారే బయటకు గెంటివేసింది కోడలిని అని రాస్తే అది సహజత్వానికి దగ్గరగా వుందని భావిస్తారు పాఠకులు.''

''కానీ అత్తగార్లు మారాలని అందరూ గొంతులు చించుకుని చెప్తూనే వుంటారు కదా! మార్పు కోరే వాళ్ళు తప్పకుండా సమర్థిస్తారు నేను రాసేది'' అన్నాను.

''నీ అభిప్రాయం తప్పు. మార్పు కావాలని అరవడం వేరు. అలాంటి సిట్యుయేషనే తమ ఇళ్ళల్లో ఎదురయితే ఎవరూ అలాంటి మార్పును సమర్థించరు'' అన్నాడు కృష్ణ ఆవేశంగా.

నేను మాట్లాడలేదు. కృష్ణ ఆవేశం వెనక ఎంతో ఆవేదన కూడా వుంది.

''అలాంటి పరిస్థితే తమ ఆడపిల్లల కెదురయితే ఆదరించరా?'' అనడిగాను.

''అందరూ అలా ఆదరించరు. కేవలం ఒక శాతం మాత్రమే అలా చేస్తారు. మిగతా తొంభై తొమ్మిది శాతం తమ పరువు ప్రతిష్టలు మంటగలిసిపోతాయనే భయంతో ఆ పిల్లలను వదిలించుకోవడానికే ప్రయత్ని స్తారు.''

ప్రతి వ్యక్తి తనని తాను ఆ పరిస్థితిలో వుంచుకుని వూహించుకుంటే కాని, అర్థం కాదు మార్పును ఎంత వరకు సమర్థించగలము అనేది.

''నేను చెప్పినట్లు కథ మార్చి రాయి. తప్పకుండా అచ్చవుతుంది'' అన్నాడు కృష్ణ వాతావరణాన్ని తేలిక చేస్తూ.

''మార్చకపోయినా అచ్చవవచ్చు'' అన్నాను ఆలోచిస్తూ. మీరేమంటారు?

